# మృత్యుంజయుడు

బుంగల గుంట స్థానిక పత్రిక టాంటాంలో ఒక అతి విచిత్రమైన వార్త ప్రచురించ బడింది. అందులో ఇలా ఉంది.

"పోయిన ప్రాణం వచ్చిన వైనం.

బుంగలగుంట. జులై 10–

బుంగలగుంట స్థానిక వైద్య శాలలో ఒక మహాద్భుతం జరిగింది. శ్రీరాకుల శివయ్య అనే రోగి ఉబ్బసం వ్యాధితో బాధపడుతూ వారం రోజుల క్రితం స్థానికాస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. అతనికి నాల్గవ వార్డులో ఐదో నెంబరు మంచం కింద ఒకటిం ముప్పావు అడుగు సిరిచాప ప్రత్యేకించబడింది.

అతడు ఆస్పత్రిలో అడుగు పెట్టిన మరునాడు స్పృహ లేకుండా పోయింది. మూడవ రోజు రాత్రి తొమ్మిది గంటల నలభై మూడు నిమిషాలకు అతని ప్రాణ వాయువులు అనంతాకాశంలో విలీనమై పోగా అతను చనిపోయినట్లు ధ్రువపరచ బడింది. శవాల గదిలో ఆ భౌతిక కాయం భద్రపరచబడింది.

అదే రాత్రి మూడు నలభైకి శ్రీరాకుల శివయ్య పునర్జీవుడయ్యాడు."

ఈ వార్త ఆధారంగా చేసుకొని టాంటాం పత్రిక ప్రచురించిన సంపాదకీయంలో మరవరాని విషయాలున్నవి. పూర్తి పాఠంలోని ప్రధానాంశముల క్లుప్తీకరణ ఇది :

"ప్రపంచ చరిత్రలోనే బుంగలగంట స్థానిక వైద్యశాల ప్రముఖాతి ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించుకొన్నది. రోగులనే బాగు చేయలేక నానా యాతనలు పడుతున్న ఈ రోజులలో చనిపోయిన వారిని బ్రతికించేటంతటి అభ్యుదయ ప్రగతిని సాధించిన స్థానిక వైద్యాలయాధికారులను, సిబ్బందిని అభినందిస్తున్నాము. అత్యంతాశ్చర్యకరము, అద్భుతావహము, ఆనంద ప్రదము అయిన ఈ వార్త యావద్భారత దేశాన్నే కాదు. నిఖిల ప్రపంచాన్ని స్తంభింప

జేస్తున్నది. ఆధునిక వైద్య శాస్త్రంలో అంతిమ ధ్యేయాన్ని చేరుకొన్న స్థానిక వైద్యాలయ నిర్వాహకుల కివే మా జోహార్లు. అమందానంద కందళిత హృదయార విందముల మకరందములతో మా కృతజ్ఞతాంజలులు."

బుంగలగుంటలో ఏ మూల చూచినా ప్రజలు గుంపులు గుంపులుగా చేరి ఇదే విషయాన్ని చర్చించుకొంటున్నారు. టాంటాం పత్రికలో ప్రచురించిన ఈ వార్త వాయువేగ మనోవేగాలతో సి.ఐ.డి. ఇన్‌స్పెక్టర్ బీరప్ప చెవిలో పడింది.

బీరప్ప చాలా మంచివాడు. ఎప్పటికప్పుడు ఏదో ఒక వార్త ప్రభుత్వానికి అందిస్తూ తన నిత్య జీవితాన్ని అత్యంత ప్రశాంతంగా గడుపుకొంటున్నాడు.

మనిషి చావడం నిజం కావచ్చు. అందులో ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు. పైపెచ్చు బుంగలగుంట ఆస్పత్రిలో అడుగుపెట్టిన వారు ప్రాణాలతో బయటికి రావడం చాలా అరుదు. అదృష్టవశాత్తు వచ్చినా ఆరు మాసాలకంటే ఎక్కువ కాలం బ్రతకడం అసంభవం. అలాంటి ఆస్పత్రిలోని వైద్యులు చచ్చిన వారిని బ్రతికించారంటే ఎంత గొప్ప విషయం.

ఆ మధ్య బుంగలగుంట ఆస్పత్రిలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నందు వల్ల ఒక్కసారి పరిశీలించి సమగ్రమైన రిపోర్టు పంపమని పై అధికారుల నుండి తాఖీదు అందినపుడు తానెంతో జాగ్రత్తగా పరిశోధన చేశాడు.

ఆస్పత్రిలోని ప్రతి వార్డు తనిఖీ చేశాడు. రాత్రి 8 గంటలకు తలపాగా చుట్టుకొని చిరిగిన చొక్కా వేసుకొని ఒక సత్తు చెంబు చేత్తో పట్టుకొని సింహ ద్వారంలో ప్రవేశించబోతుంటే కాపలవాడు నిలదీసి అడిగాడు. ఎంత బ్రతిమాలుకొన్నా పావలా కాసు ముడుపు చెల్లించుకొన్నాకనే లోనికి పోనిచ్చాడు. ఆ వెనక ఆయన చూచిన దృశ్యములత్యంత మనోహరములైనవి. ప్రతి దృశ్యాన్నీ గుర్తుంచుకోవడానికి పెన్సిల్ తీసుకొన్నాడు. కానీ ఆ మధుర క్షణాలలో తన్ను తానే మరిచిపోయాడు.

ఆ వేప చెట్టు క్రీనీడలో రాతి బండ మీద రెండు మానవాకారాలు కనిపించాయి. ఒకటి స్త్రీ ఆకారమని, రెండవది పురుషాకారమని ఒకటి రెండు క్షణాలలోనే ఆయన గుర్తించగలిగాడు.

"ఇక్కడే ఉండు రెండే నిమిషాల్లో వచ్చేస్తాను."

"ఏం...? ఏం?...."

"ఆ స్పెషల్ వార్డులో ఉండే అమ్మాయికి మందివ్వాలి."

"ఊహూఁ...."

"ఇచ్చి వస్తానన్నాగా?"

"ఫరవాలేదులే. మళ్ళీ ఇవ్వచ్చు."

"నువ్వెప్పుడూ ఇంతే."

"నువ్వూ అంతే."

ఈ మాటల్ని అస్పష్టంగా విన్న బీరప్ప 'వీళ్ళెప్పుడూ ఇంతేనేమో' అనుకుంటూ పక్కకి తప్పుకొని ముందుకు నడిచాడు.

పిల్లల వార్డులోనుంచి ఎవరో పసిపాప ఒకటే రోదన చేస్తూంది. బహుశా ఆ పాప ఈ ప్రపంచంలోని పాపాలకు నిష్కృతే లేదా అంటూ ఏడుస్తున్నట్లు తోచింది బీరప్పకు.

బీరప్ప మరో రెండడుగులు ముందుకు వేశాడు. అక్కడో ఆకారం ఇంకో వికృతాకారంతో చేతులు కలిపి ముందుకు పోతున్నది.

"ఇది క్రీడాస్థలమా! నాటక రంగమా! నృత్య వేదికా! మృత్యులోకమా! ఏది సత్యం?"

అనుమానంలో పడ్డాడు బీరప్ప. అడుగులో అడుగు వేస్తూ అలాగే వెంబడించాడు.

"నేను వచ్చి అరగంట అయింది. నాలుగుమార్లు కిటికీలో కనిపించినా నువ్వు బయటికి రాకుంటే ఏమర్థం?"

"అవునవును. అంతా అబద్ధం. ఆ ముసలాడికి రెండు మాత్రలిచ్చి వచ్చేలోగా కొంపలంటుకు పోయినట్లు అరుస్తావేం?"

కసురుకొన్నట్లుందా స్త్రీ కంఠం.

బీరప్పకు మతిపోయినట్టుంది. ఆ ఆవరణలో ప్రతి చెట్టుకింద ఒక్కో జంట కనిపించింది. చిలకా గోరు వంకల్లా వారు సలుపుతున్న ప్రణయ క్రీడల్ని, ఆ క్రీడలో ప్రదర్శితమవుతున్న వివిధ భంగిమల్ని తిలకించినపుడు బీరప్పకు నిజంగానే మతి పోయింది. బహుశా ఆస్పత్రికంటూ బయలుదేరి ఏ విలాస లోకంలోనో అడుగుపెట్టానేమో అనే అనుమానం వేసింది.

ఒక్కసారి నాలుగు దిక్కులా కలయజూచాడు. సందేహం లేదు. అది బుంగలగుంట ఆస్పత్రే.

అవునవును

అక్షరాలా సత్యం.

"ఇదే బుంగలగుంట ఆస్పత్రో! బుంగులగుంట ఆస్పత్రో!..." అంటూ గట్టిగా శక్తి కొద్దీ ఓండ్రపెడుతూ సాక్ష్యం ఇచ్చింది ఒక గాడిద.

ఆస్పత్రికి నాలుగువైపులా గోడలు శిధిలమై ప్రాచీన చరిత్రలోని పురాతన కట్టడాలను స్మృతికి తెచ్చే ఆ ప్రాంగణంలో గాడిదలు స్థిరంగా ఉండడానికి ప్రత్యేకమైన వసతులు ఏర్పాటు చేయబడి ఉన్నవి.

బీరప్ప పగటి వేళల్లో అనేకమార్లు ఆస్పత్రి చూచాడు. రాత్రిపూట ఉన్నంత రద్దీగా, ఆహ్లాదకరంగా, ఆనంద ప్రదంగా పగలు కనిపించక పోవడంలో గొప్ప రహస్యం ఉన్నట్లు ఆయనకొక వదలడానికి వీలుకాని అనుమానం పుట్టిపోయింది.

ఎంత మంచివాడైనా బీరప్ప రంధ్రాన్వేషకుడు. అపరాధ పరిశోధకుడు. జాతికీ, నీతికీ చిలుమో చీడో పట్టినప్పుడు అది ఎక్కడ పుట్టిందో కనిపెట్టగల ఘటికుడు.

ఆస్పత్రి పడమటి ద్వారంలో వచ్చే పోయే జనాల సంఖ్య మితంగా ఉన్నా ఊరి కావలి గేటులో ఎవరైనా సరే ఎందుకు వస్తారనే అనుమానం కలిగింది చెట్టంత మనిషి బీరప్పకు.

అతడు మెల్లిగా ఆ వైపు దారి తీశాడు. గేటులో నెత్తిపై పెద్ద పెట్టెతో బయటికి వెడుతున్న ఓ వ్యక్తి కంటబడ్డాడు.

"ఏయ్, ఎవరక్కడ?" ఆ వ్యక్తే పలకరించాడు బీరప్పను.

"మా వాళ్ళున్నారు బాబూ" అన్నాడు బీరప్ప నాటకంలో దీనుడి స్వరాన్ని వ్యక్తం చేస్తూ.

"సరే పో. ఈ పక్కకి వస్తే పోలీసులుంటారు" అంటూ ఆ వ్యక్తి గేటు దాటుకొన్నాడు.

బీరప్ప అతని నీడను పసిగడుతూ అతి మృదువుగా నడిచిపోతున్నాడు.

దక్షిణపు దెసలో దేవాలయం ధ్వజస్తంభంలోని గంటలు మానవత్వం పతానావస్థను సంఖ్యా రూపంలో సూచిస్తూ గణగణలాడుతున్నవి.

అతనికి ఎదురుగా ఒక పెట్టె వెడుతూనే ఉన్నది.

బీరప్ప అనుకరిస్తూనే ఉన్నాడు.

దండంపేట దాటుకొని బజారులో వెడుతున్నది పెట్టె. బీరప్ప కూడా వెంబడిస్తున్నాడు.

ఒక పెద్ద మేడ ముందు పెట్టె ఆగిన మరుక్షణంలోనే ఇద్దరు కుర్రాళ్ళు ఆ పెట్టెను లోపలికి పట్టుకు వెళ్ళారు.

అది కుంకుం మెడికల్ స్టోర్స్. గుమ్మడి కాయలంతేసి అక్షరాలు విద్యుద్దీపాల కాంతితో నాగరిక ప్రపంచాన్ని సవాల్ చేస్తున్నవి. సంపాదించడం చేతకాని వాళ్ళని వెక్కిరిస్తున్నవి. బీరప్పను మాత్రం ఆ అక్షరములు "ఇదేం కొత్త కాదుగా! ఏళ్ళ తరబడీ సాగుతున్న నిరంతరమైన వ్యాపారం. ఇందులో ఆశ్చర్యమేముందీ? వెళ్ళు!" అంటూ నిశితంగా చూచాయి.

"ఈ ఉద్యోగమే పాడు ఉద్యోగం" అనుకొన్నాడు బీరప్ప.

ఎన్నో పాపాలను ఈ పాపిష్టి కళ్ళతో చూడవలసి వస్తున్నది. చావు బ్రతుకులతో రోగులు చస్తూంటే చెట్ల కింద రొమాన్సు!

దేశంలో అయ్యే ఉత్పత్తి చాలక మందుల కోసం అన్య దేశాలను ఆశ్రయిస్తూంటే, ఉన్న మందులన్నీ పెరటి దారిలో పయనించి బజారులోని మందుల షాపుల్లో ప్రత్యక్ష మవుతున్నాయి

"అసలీ ఉద్యోగానికే తిలోదకాలు వదిలిపెడదామా!" అనుకొన్నాడు బీరప్ప.

అది సాధ్యమయ్యే పని కాదు. ఇరవై ఏళ్ళ సర్వీసు ఇట్టే గంగలో కలిసి పోతుంది. అయితే ఈ పాపాల పట్టీనంతా చిత్రగుప్తునిలా చిట్టా కెక్కించినంత మాత్రంలో కలిగే ప్రయోజనం?

అతనికి నిజంగానే విసుగు పుట్టింది. ముందు రోజుల్లో తానేదైనా రిపోర్టు చేసినా. లేక తన పరిశోధనాంశాలను పంపించినా క్షణాల మీద ఏదో చర్య కనిపించేది. ఇప్పుడట్లా లేదే!

రొమాన్సు, బ్లాక్ మార్కెట్టులకు వైద్యాలయం ప్రధాన కేంద్రమని తాను వ్రాస్తే మాత్రం పట్టించుకొనే వారుండాలిగా!

ఆయన కుంకుం మెడికల్ స్టోరు నుండి మళ్ళీ ఆస్పత్రికి వెళ్ళాలను కొన్నాడు. కాని ఎందుకో ముందడుగు వేయలేకపోయాడు.

రాత్రి ఎనిమిదిగంటలపుడే అక్కడి వాతావరణం అల్లా ఉంటే, పది గంటలు దాటగానే ఎట్లా ఉంటుందో ఏమో చూడాలనిపించింది. అపరాధ పరిశోధకుల స్వభావం అలాంటిది. ఈ రాత్రి జాగరణ చేసి అయినా సరే ఈ పన్నెండు గంటల కార్యక్రమ సరళిని ఒక నివేదికగా రూపొందించాలని పించింది.

ఈ మారు అతను ఉత్తర దిశ ద్వారంలో ప్రవేశించాడు. అక్కడే ఆపరేషన్

గది. ఆ వసారాలో ఒక చిన్న టేబిల్, రెండు కుర్చీలు.

ఆమె అందిస్తున్నది.

అతడు తాగుతున్నాడు.

అతడు రోగి కాదు.

అతడు తాగుతున్నది మందు కాదు.

అతడు డాక్టర్!

తాగుతున్నది మద్యం అన్న విషయం అతని కదలికలే తెలుపుతున్నవి. అంతేకాదు. ఆ ఆసవం సువాసనలను అన్నిటా సమవర్తి అయిన వాయుదేవుడు వీలైనంత దూరానికి అందచేస్తున్నాడు. గాలిదేవుడికి మంచి చెడ్డలు తెలియవు. మద్య నిషేధం అమలులో ఉన్న బుంగులగుంట ప్రాంతంలో మద్యాన్ని సేవించే మహనీయుల గుట్టుమట్టులు ఇట్లా బహిరంగం చేయడం క్షమార్హం కాదు.

బీరప్ప హడలిపోయాడు. పొరబాటున ఉదయం వరకు అక్కడే ఉండాలని నిశ్చయించుకోవడం గొప్ప పొరబాటుగా తోచిందతనికి. చూడరాని దృశ్యాలను చూడడానికీ, వినరాని మాటలను వినడానికీ బ్రహ్మదేవుడీ వర్గాన్ని సృష్టించినట్లు తోచిందతనికి.

'అప్పుడే అలసిపోతే ఎట్లా? ఇక్కడ చూడవలిసిన మహాద్భుతాలింకా ఉన్నవి' అన్నట్లు ఒక జంట తన్ను నిర్లక్ష్యంగా దూసుకుపోయింది. బీరప్ప అకస్మాత్తుగా ఆ వైపు దృష్టిని మరల్చడంతో పాటు అడుగు మీద అడుగు వేసుకొంటూ వెంబడించాడు.

ఆ దారి సరాసరి పురుళ్ళ వార్డుకు చేర్చింది. అక్కడ వసారాలో పెద్ద చాప పరిచి ఉంది. ఆ చాప మీద అయిదారుగురు కూర్చున్నారు. వారిలో ఇద్దరు మగవాళ్ళు కూడా ఉన్నారు. పేకాట మంచి రసకందాయంలో ఉంది.

'ఓరి భగవంతుడా! ఏమిటీ విపరీతం!'

బీరప్ప దిగాలుపడి నిలిచిపోయాడు.

ఆడవాళ్ళు ప్రసవించే వార్డులో మగాళ్ళతో చీట్ల పేకలాడుతున్నారు. వారికి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లా లోపల నుండి పురిటి పాపల ఏడ్పులు వినిపిస్తున్నాయి.

కెటిల్‌లో టీ.

టిన్‌లో సిగరెట్లు.

ఒక్క సినిమాల్లో తప్ప స్వయంగా ఆడవాళ్ళు సిగరెట్లు కాల్చడం అదే

చూడ్డం మొదలు బీరప్పకు.

ఉన్నట్టుండి పెద్ద మూలుగు... రోదన... వినిపించగానే పాపం బీరప్ప గడగడ లాడిపోయాడు. క్షణకాలంలో తమాయించుకొని అట్టే నిలబడ్డాడు. 'బహుశా మహాతల్లి ఎవరో ప్రసవవేదన పడుతుంటుందేమో!" అనుకొన్నాడు.

అవును. ఆమె ఎవరో ప్రసవ వేదన పడుతున్నది.

"రామ్మా! నా తల్లీ! దండాలమ్మా!"

ఆ పేషెంటు తాలూకు ముసలావిడ గొంతుక అతి దీనంగా వినిపిస్తూంది. ఆ లోపలి నుండి పురిటి నొప్పుల ఘోషలు. ఈ వెలుపల పకపకలు వికవికలు.

బీరప్ప రౌద్రావేశంతో ఊగిపోయాడు. అయినా తనేం చెయ్యగలడు? అది సమయం కాదు. అసలు తన ధర్మం ఏం జరుగుతున్నదో తెలుసుకోవడం వరకే.

ఇట్లా రెండు మూడు నిమిషాలు గడుస్తూండగానే పెద్ద పొలికేక వినిపించింది. ముసలిగొంతు బావురుమన్నది.

పేకాట సాగుతూనే ఉన్నది. సిగరెట్లు కాలుతూనే ఉన్నవి. పెరటి దారిలో పెట్టెలు వెడుతూనే ఉన్నవి. దొరగారు తాగుతూనే ఉన్నారు.

ప్రతి చెట్టుకిందా మానవాకృతులను పోలిన క్రీనీడలు కౌగిలించు కొంటున్నవి. ముద్దిడుకొంటున్నవి. ప్రణయ లీలా విలాస వీచికలలో పరవళ్ళు వారే ఆ ప్రకృతిలో రోగుల ఆక్రందనాలు మైనస్ బ్యాలెన్సులో పడిపోయినవి.

ఇట్లా ఎంతకాలం గడపాలి? అప్పుడే పన్నెండు కొట్టింది. బీరప్పకు నిద్ర రాలేదు. కానీ హృదయం ఆవేదనతో దహించుకొని పోతున్నది. తానీ రాత్రి ఒక మహాద్భుతమైన అపవిత్ర కేంద్రాన్ని దర్శించాడు. అందులో తాను తిలకించిన ప్రతి దృశ్యమూ అద్భుతావహమైనది. తన కళ్ళ ముందు కనిపించిన ప్రతి పాత్రా విద్యావంతమైనది; సంస్కృతికి, నాగరికతకు, సభ్యతకు ఆలవాలమైనది.

ఇలాంటి ఘోర దృశ్యాల నన్నిటిని గ్రంథంలో ఎక్కించి, ఆ కట్టల నన్నింటిని గుట్టలు గుట్టలుగా పేర్చడమే తన ఉద్యోగ ధర్మం. ఇలాంటివి కనిపెట్టినందుకే పూర్వకాలంలో బహుమానాలుండేవి. ఈ కాలం మాట చెప్పనెందుకు?

ఇట్లా ఉదయం వరకు ఆ వాతావరణంలో గడిపి ఆ మరునాడు వందా డెబ్భై ఆరు పేజీల నోట్సు వ్రాసి ఆ రిపోర్టు అంతా పైకి పంపాడు బీరప్ప.

సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నాడు.

అంతకంటే నియమంతో మందులు ఆస్పత్రికి సరఫరా చేయబడుతున్నవి.

కానీ ఆ మందులలో నూటికి ఎనభై వంతులు మార్కెట్టులోని మందుల షాపుల్లో ప్రత్యక్షమవుతున్నవి. అదే వరసన అన్నీ యథాతథంగా సాగుతున్నవి.

ఈ స్థితిలో ఉన్న ఆ ఆస్పత్రిలో చచ్చిన మనిషిని బ్రతికించారంటే తాను నమ్మలేక పోయాడు.

ఈమారు పైనుండి ఏ తాఖీదు రాకపోయినా ఆ రహస్యాన్ని ఛేదించాలనే పట్టుదల తనలో కలగడం తనకే ఆశ్చర్యం వేసింది.

బస్‌స్టాండులో ఉన్న కిల్లీకొట్టులో టాంటాం పత్రిక అందుకొని నిశితంగా పరిశీలించాడు.

శ్రీరాకుల శివయ్య పేరుంది కానీ ఊరేదో తెలియదు. అసలా మనిషిని కలుసుకొంటేనే గానీ విషయం కనుక్కోవడం అత్యంత కష్టం. ఈ పరిశోధనలో పది రూపాయలు ఖర్చు అయినా నిజం తెల్చుకోవాలనిపించింది. లేకుంటే ఈ వార్త ఆధారంగా ఎన్నో ప్రమాదాలు జరగవచ్చు. బుంగలగుంట డాక్టరు గారిని అమాంతం అమెరికాకే ఆహ్వానించవచ్చు. లేదా అతనికో స్పెషల్ అవార్డు లభించనూవచ్చు. ఇంతకూ ఆ డాక్టరు గారు ఆ రోగిని బ్రతికించిన తరువాత మద్యాన్ని సేవించాడా? లేక మద్యాన్ని ఒక్కొక్క ఔన్సే సేవిస్తూ ఆ రోగికి ఊపిరి పోశాడా! ఇదే మొట్టమొదట తేలవలసిన విషయం.

ఎందుకంటే మద్యాన్ని సేవించిన వెనుక రోగిని బ్రతికించి ఉంటే మద్య నిషేధాన్ని రద్దుచేసి పారెయ్యవచ్చు. రోగిని బ్రతికించిన వెనక మద్యాన్ని సేవించి ఉంటే మద్య నిషేధాన్ని ఇంకా అనేక నియమాలతో అమలులో ఉంచవచ్చు.

బీరప్ప మళ్ళీ రెండవసారిగా బుంగలగుంట ఆస్పత్రికి పరిశోధనార్థం బయలుదేరాడు.

రికార్డు రూములో దొరికిన వివరాలు బట్టి శ్రీరాకుల శివయ్య స్వగ్రామం ఈతాకులకోన. తండ్రి పేరు శ్రీరాకుల జానయ్య. వయస్సు నలభై అయిదు.

ఈతాకులకోనకు బుంగలగుంటకు దూరం పదహారు మైళ్ళు. ఆ రహదారిలో రోజుకు ఇరవై ట్రిప్పులు బస్సులున్నవి. బీరప్పకు ఆ దారిలో వెళ్ళడం అంటే మహాకష్టం. బస్సులో కూచున్న వాడు గుఱ్ఱం మీద స్వారీ చేస్తున్నట్లు భావించి అందుకనుగుణంగా పైకి క్రిందికి తన స్థూల కాయాన్ని ఎగవేస్తూ దిగదీస్తూ ఉండాలి. కారణం ఏమంత పెద్దది కాదు. రోడ్డు మీద గజానికో గజం లోతు గుంతలున్నాయి. అంతే! ఆ బస్సులో ప్రసవానికని బుంగలగుంట ఆస్పత్రికి వచ్చే

అబలలెందరో ఎక్కడో ఒక చోట ప్రసవించిన ఘట్టాలు కోకొల్లలు. ఆ డ్రైవర్లు-ఆ కండక్టర్లు అతి దయార్ద్ర హృదయులైనందున వారికి అక్కడికక్కడే ఆ బస్సుల్లోనే పురిటి గదులు ఏర్పాటు చేసి ఎందరికో ప్రాణదానం చేశారు.

ఆ దారిలో బీరప్ప ఈతాకులకోనకు వెళ్ళకతప్పలేదు. ఈతాకుల కోనలో శిగ్రాకుల శివయ్య అంత పెద్దగా చెప్పుకోదగ్గ రైతు కాకపోయినా నాలుగు ఎకరాల పంట పొలము, పన్నెండెకరాల ఈతతోపు ఉండడం వల్ల పచ్చగానే కాలం తోస్తున్నాడు.

'ఆయన్ని ఎట్లా కలుసుకోవాలి?.... ఏమని ప్రశ్నించాలి?' ఇత్యాది ఆలోచనలతో బీరప్ప శివయ్య ఇంటికి వెళ్ళాడు. శివయ్య ఆ సమయానికి మిరప తోటకు నీరు కడుతున్నాడని తెలిసింది.

చచ్చిపోయిన మనిషి బ్రతికి సేద్యం చేస్తుంటే చూడాలనే కోరిక అందు లోనూ అపరాధ పరిశోధనే జీవితంగా ఉన్నవాడికి ఎంత తీవ్రంగా ఉంటుందో విశదీకరించ నవసరం లేదు.

ఈతాకులకోనకు బయట నల్లరాళ్ల చెరువు దాటుకొంటే బుల్లోడితిప్ప సమీపంలో ఉంది శివయ్య పొలం. బీరప్ప వెళ్ళిన సమయానికి సరిగ్గా శివయ్య ఏల్యమోడి పాదుకు నీరు కడుతున్నాడు. ప్రతి పంటలోను ఒకపాది ఏలినోడికి విడిచిపెట్టడం అనాది నుండి ఆ ఇంటివారి సంప్రదాయం. ఆ వచ్చిన ఆదాయంతో ఏడాదికి ఒకసారి కొండకు యాత్ర జరిగి తీరవలసిందే. దేవుని కొండ ఎన్ని వందల మైళ్ళయినా వెళ్ళక తప్పదు.

"మీ కోసమే వచ్చాను. మీ దగ్గిర పచ్చులగండి పరుసలో పట్టుకు వచ్చిన కోడెదూడలున్నాయని తెలిసి వచ్చాను" అన్నాడు బీరప్ప గనిమమీద కూర్చుంటూ.

బీరప్పకు ఎక్కడెక్కడ ఎవరితో ఎట్లా మాట్లాడాలో బాగా తెలుసు.

"ఉంటే మాత్రం ఇస్తామని ఎవరన్నారు?" అంటూ శివయ్య దగ్గిరికి వచ్చి కూర్చున్నాడు.

మనిషి దిట్టంగా గుండ్రాయిలా ఉన్నాడు. ప్రతి కండరమూ మెలిదిగిరి నిగనిగలాడుతున్నది. ముఖం గంభీరంగాను స్పష్టంగాను తేటగాను ఉంది. ఇంత ఆరోగ్యవంతుడికి ఉబ్బసం ఏమిటి?

ఆశ్చర్యమయింది బీరప్పకు. అయినా పూర్తి వివరాలు తెలుసుకోక ముందు తానే నిర్ణయానికి రావడానికి వీల్లేదు.

"అబ్బే! మీరు ఆ మధ్య బుంగలగుంట ఆస్పత్రికి వచ్చిన సందర్భంలో తెలిసింది మీవద్ద ఉన్నాయని" అంటూ నీళ్ళు నమిలాడు బీరప్ప.

బుంగలగుంట ఆస్పత్రి పేరెత్తగానే శివయ్య ముఖంలో ఒక విచిత్రమైన నవ్వు వెలిగిపోయింది

"ఎందుకండీ నవ్వుతారు? మీరు అదృష్టవంతులు కాకుంటే చచ్చిపోయి ఎట్లా బ్రతికారు?" బీరప్ప మెల్లిగా అసలు కథకు నాందీ ప్రస్తావన చేశాడు.

"నేను చచ్చి బ్రతికానో, లేక నన్నే వారు చంపి బ్రతికించారో మీకెట్లా తెలుసులెండి. అసలు చెప్పుకోరాదు గానీ అది ఆస్పత్రి కాదు" అన్నాడు శివయ్య.

"ఏం జరిగిందంటారు?" ఆత్రంగా ప్రశ్నించాడు బీరప్ప.

"అసలు విషయం చెబితే కొంపలంటుకుంటాయి ఏదో ఉద్యోగాలుండాలంటే ఇట్లాంటి విషయాలు ఎక్కడికక్కడ మరిచిపోవడమే మంచిది" అన్నాడు శివయ్య నిర్లిప్తంగా.

ఈ మాటతో బీరప్ప హతాశుడై పోయాడు. తాను వచ్చిన పనికి ఆదిలోనే ఇట్లా విఘాతం ఎదరవుతుందని అతడు అనుకోలేదు.

"అంతేలెండి. ఎవరి ఖర్మం వారిది. అయినా మీ విషయం బలే ఆశ్చర్యంగా ఉంటే ఉండబట్టలేక అడిగాను మీకిప్పుడు ఉబ్బసం నయమైనట్టేనా?"

"ఉబ్బసమా? నాకా? ఎవరు చెప్పారు?"

"ఉబ్బసంతోనే మీరు ఆస్పత్రిలో చేరారనీ. ఆ వ్యాధి తిరగదోడి చచ్చిపోతే డాక్టర్లు బ్రతికించారనీ ఊరంతా అనుకొంటుంటే అడిగాను" అన్నాడు బీరప్ప.

"బాగుంది బాగుంది ఉబ్బసం కాదయ్యా మహాప్రభో. ఉన్నట్టుండి కడుపు నొప్పి వస్తే తట్టుకోలేక వెళ్ళాను. వెడితే ఏం చేశారో తెలుసా? సరాసరి ఆ మంచం మీద పారేసి వెళ్ళిపోయారు."

"ఆఁ...."

"అలా నొప్పితో మూన్నాళ్ళు బాధపడుతుంటే ఎవరో మహాతల్లి రెండు మాత్రలిచ్చి వీటిని మింగేసెయ్ నిద్రపడుతుందంటే ఇంకా ఒకటిమ్మని తీసుకొని మూడు మింగేశాను. అంతే... సరిగ్గా మూడో జాములో మెలకువ వచ్చింది. లేచి తలుపు తట్టానో లేదో ఒకటే కేకలు 'దయ్యం.... దయ్యం.... దయ్యం...' అంటూ ఆస్పత్రి దద్దరిల్లేట్లు ఒకటే గోల."

"ఆఁ..."

"ఇది మనలో మాట. ఎవరితోను చెప్పకేం. ఆ రాత్రి నేను మంచి నిద్దర్లో ఉంటే తీరా నేను చచ్చిపోయాను అనుకొన్నారట. వెంటనే నన్ను తీసుకొచ్చి ఆ పీనుగుల కొట్లో పారేశారు. నాకు ఆ పొడుగాటి మనిషి ఉన్నాడే ఎర్రగా తెల్లటోపీ వేసుకొని అతడు చెప్పాడివన్నీ...."

బీరప్ప చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో ఉన్న విషాదాన్ని పసికట్టిన మేకపిల్లకు "వీళ్ళు మనుషులు" అనే సత్యం గుర్తుకు వచ్చిందేమో ఉన్నట్టుండి అక్కడి నుండి "బే... బే...." అంటూ పారిపోయింది.

"బాగుందే కథ... మళ్ళీ?" ఆసక్తితో ప్రశ్నించాడు బీరప్ప.

"నేనట్లా తలుపు బాదేస్తూంటే 'శవాల గదిలో దయ్యం బాబో' అంటూ ఆడా మగా అంతా ఏకమై అటూ ఇటూ పరుగులు తీశారట! చివరికి డాక్టరు గారు మేలుకొని అక్కడికి వచ్చి గుండె నిబ్బరం చేసుకొని తలుపు తీశాడు.

నన్ను మెల్లిగా నడిపించుకొని అక్కడో గదిలోకి తీసుకువెళ్ళి అడిగితే, మూడు మాత్రలు మింగాననీ బాగా నిద్రపోయాననీ, అంతే తెలుసునని చెప్పాను. ఆయన ఎగాదిగా చూచి 'ఈ రిజిస్టరులో నువ్వు చచ్చిపోయావని ఉంది. నువ్వు బ్రతకడం ఆశ్చర్యం' అన్నాడు. ఆ ప్రక్కనే సన్నగా బక్కపలచగా ఉన్న ఆమె 'ఇట్లా ఎన్నో జరిగాయి సార్. చచ్చిపోయి నరకలోకానికి వెడితే ఆ మనిషివి నువ్వు కాదనీ, వేరేవాడనీ వెనక్కి పంపేసిన ఘట్టాలున్నాయిగా?' అని అంటూ, నా వైపు చూచి 'నీకు యమదూతలు కనిపించారా?' అని అన్నది.

ఈ మాటలకు ఒళ్ళు మండి 'ఆఁ.... చూస్తున్నాగా.' అన్నాను.

"ఎక్సలెంట్. బలే జవాబిచ్చావు?" అన్నాడు బీరప్ప.

ఆ మాట వినగానే శివయ్య మళ్ళీ ఆరంభించాడు.

"డాక్టర్ గారు కోపంతో అటూ ఇటూ తిరుగుతూ పిడికిలి బిగించి పళ్ళు కొరికి నొసలు గుద్దుకొన్నాడు.

నన్ను వీళ్ళంతా దయ్యమనుకొంటున్నారనే అనుమానం మరీ బాగా ధ్రువపడడంతో అక్కడి నుండి పారిపోదామనుకొన్నాను.

డాక్టరు గారు రిజిస్టరులోని కాగితాన్ని పరపరా చించి ముక్కలు చేసి పారేశారు.

'యు గెటవుట్' అంటూ గట్టిగా అరిచేలోగా అందరూ వెళ్ళిపోయారు.

బీరప్ప ఆనందంగా వింటున్నాడు. కానీ ప్రతి మాటతోను అతని రక్త

నాళాలు ఉడికి పోతున్నవి.

'అందరూ వెళ్ళిపోయాక డాక్టరు గారు ఒక పది రూపాయల నోటు నా చేతిలో పెట్టి విషయం ఎవ్వరికీ చెప్పబోకు. నిద్రలో ఎన్నో రకాలున్నాయి. నిద్ర, మగత నిద్ర, కోడి నిద్ర, గాఢ నిద్ర, దీర్ఘనిద్ర – ఇట్లా బోలెడున్నాయి. నీకు తెలియదుగానీ, నువ్వు నిజంగానే చనిపోయావు. ఆ మాత్రలు ముందుగా ఇవ్వడం మూలాన అవి గుండెల్లోకి వెళ్ళి ప్రాణాలు వెళ్ళే గొట్టానికి అడ్డంగా పడి ఉండి పోయాయి. అంచేతనే నువ్వు బ్రతికావు. అదంతా సైన్సు. నీకు తెలియదు చెబితే. అంటూ ఆప్యాయంగా నన్ను సాగనంపాడు. ఇంతకు జరిగిందేమంటే కడుపు నొప్పితో బాధపడుతుంటే మూడు రోజుల పాటు నాకు మందివ్వలేదు. మూడు రాత్రులు నిద్ర సరిగా లేదు. ఆనాడు రాత్రి మూడు మాత్రలు మింగేశానా? అవి నిద్రకిచ్చే మాత్రలని మా అమ్మాయి ఇంటికి వచ్చాక చెప్పింది. ఆ దెబ్బతో నిద్రపోయాను. బాగా గాఢంగా నిద్రపోయాను. చచ్చాడనుకొని ఈడ్చి పారేశారు!" అన్నాడు శివయ్య నవ్వుతూ.

"పోనీ ఆ కోడెల కథ చెప్పు!" అన్నాడు బీరప్ప హుందాగా.

"వాటినిచ్చేట్లగా ఉంటే ఈ పాటికే అమ్మేసే వాణ్ణి. బండికీ లేదు. కపిలకూ లేదు. కావాలంటే పోతులోళ్ళ కండిగెలో అయ్యావు దగ్గిర మంచి కోడెలున్నాయి. వెళ్ళి కనుక్కోండి" అన్నాడు శివయ్య.

"పోతులోళ్ళకండిగె ఎంత దూరం ఉంటుంది?" ప్రశ్నించాడు బీరప్ప.

"ఆఁ.... ఒకటిన్నర రాయి ఉంటుంది. ముష్టి మాకులకుంట కాపక్కే" అన్నాడు.

బీరప్ప అక్కడి నుండి రోడ్డువైపు దారి తీశాడు ఎన్నో ఆలోచనలతో. ఇవన్నీ గొడవలే. రోగులకు మందులివ్వకుంటే మానెగానీ సరాసరి శవాల గదిలోకి పంపడం ఎంత ఘోరం!

ఈ సత్యాన్ని చెబితే నమ్మేవారెవరు? సాక్షులు కావాలి. ఋజువు చెయ్యాలి. పోనీ విన్నదీ కన్నదీ వ్రాస్తే ఏమవుతుంది?

ఏమైతేనేం వ్రాయడం తన ధర్మం. ఫలితాల మాట దేవుడెరుగు.

బీరప్ప చాలా శ్రమతో బుంగలగుంట చేరుకొన్నాడు. ఇంటికి వెళ్ళి నడుం పూసలికి నూనె రాయించుకొన్నాడు. ఈతాకుల కోన దారిలో ప్రయాణమంటే సామాన్య విషయం కాదుగదా!

ఆ ఉదయం టాంటాం పత్రిక ముందుంచుకొని ఒక పెద్ద రిపోర్టు తయారు చేసి పైకి పంపించాడు. అది ఎంత పైకి వెళ్ళిందో తెలియదు గానీ ఆ మరుసటి వారంలో బీరప్పకొక శ్రీముఖం వచ్చింది. దాని సారాంశం ఇలా ఉంది.

"చచ్చినవాడు శివయ్య కాదు, బసవయ్య. ఎవరో అల్లరి మూక ఆడ నర్సులను బెదిరించడానికి దయ్యం దయ్యం అని కేకవేశారు. పెరటి దారిలో వెళ్ళిన పెట్టె మందుల పెట్టె కాదు. అసలా కాంపౌండుకి ఒక్కటే దారి. నువ్వు చూచింది డాక్టర్ను కాదు రోగిని. అతడు తాగింది మద్యం కాదు, మందు. ఇట్లా అజాగ్రత్తగా రిపోర్టు పంపుతున్నందుకు నీకు వార్నింగ్ ఇస్తూ నిన్ను ముష్టికంపల పేటకు ట్రాన్స్‌ఫరు చేయడమైనది."

బీరప్ప రవ్వంతైనా చింతించలేదు. సత్యానికి కాలం లేదనుకొన్నాడు.

"అవునవును" అంటూ బల్లి పలికింది.

"ఈ బల్లుల కెలా తెలుసు? మనసులో ఆలోచన మొదలు పెట్టగానే అలారం గడియారం వలె అందుకొంటాయి" అని అనుకొంటూ వీధి ముంగిట్లో నిలబడ్డాడు.

కుర్రాడు టాంటాం పత్రికల్ని తీసుకువెడుతుంటే "ఇదే ఈ ఊళ్ళో చివరి వారం" అనుకొని ఒకటి తీసుకొన్నాడు. మొదటి పేజీలోనే పతాక శీర్షిక...

"బుంగలగుంట ఆస్పత్రిలో రెండు శవాలు పోట్లాడుకొన్నాయి."

బుంగలగుంట. జులై 20-

గతరాత్రి నాలుగవ ఝామున సరిగ్గా నాలుగు గంటలకు స్థానిక వైద్యాలయంలోని శవాల గదిలో రెండు శవాలు అతి దారుణంగా పోట్లాడు కొన్నవి. ఈ పోట్లాటను నివారించడానికి వైద్యాలయం సిబ్బంది మొత్తం విశ్వప్రయత్నం చేయవలసి వచ్చింది. ఆ సమయానికి సరిగ్గా తలుపు తాళం చెవి దొరక్కపోవడం వల్ల లోపల ప్రాణం వచ్చిన శవాలు దశదిశలూ దద్దరిల్లేటట్లు, కేకలు పెడుతూ భూనభోంతరాళాలు బద్దలయ్యేటట్లు ఆర్భాటాలతో రెండు కిటికీలను బ్రద్దలు కొట్టినవి. చివరికి తాళం పగలగొట్టి తలుపు తీసి దృఢకాయులైన ఆరుగురు మనుష్యుల సాయంతో రెండు శవాలను అదుపులో పెట్టవలసి వచ్చినది.

అందులో ఒక శవం పేరు పిడకల గౌరయ్య, రెండవ శవం పేరు వడియాల చౌడయ్య.

మొదటి వ్యక్తి రాత్రి 9 గంటలకు చనిపోయాడు.

రెండవ వ్యక్తి రాత్రి 9.30 కు చనిపోయాడు.

ఇట్లా చనిపోయిన మనుష్యులను బ్రతికించడమే గాక వారి కా క్షణంలోనే బ్రహ్మాండమైన బలపరాక్రమాలను ప్రసాదిస్తున్న బుంగలగుంట వైద్యాలయ సిబ్బందికి మా నమశ్శతాలు!"

దీన్ని చదవగానే బీరప్ప తల తిరిగి పోయింది. ఈ ఉదంతాన్ని పరిశోధించమని తాఖీదు రాకముందే ముష్టికంపలపేటకు మూటా ముల్లె సర్దుకోవడం మంచిదని గబగబా ఇంట్లోకి పరుగుదీశాడు.